# ఇంక్రిమెంట్

—మాధవ్

"ఏడు కొండల వాడా, వెంకట రమణా! గోవిందా, గోవిందా."

భక్తులు పారవశ్యం తో అరుస్తూ ఒక కంపార్టుమెంటు లోంచి మరొక దాన్లోకి జరుగుతున్నారు.

దేవుని దర్శనం అయేటప్పటికి ఇంకా రెండు గంటలయినా పడ్తుందను కొన్నాడు క్యూలో ఉన్న రామారావు.

ప్రమోషను రాగానే తిరుపతికి ప్రయాణం కట్టాడు. బస్సుదిగి నేరుగా కొండమీదికి వచ్చి క్యూలో చేరాడు. నీరుకాయగుడ్డలు, పట్టు చీరలు, చింపిరి జుట్లు బాబ్డ్ హేర్‌లు అన్నీ క్యూలోనే ఉన్నాయి.

భక్తి కొండల్ని సైతం కదిలిస్తుందని చదివాడు గాని ఎక్కడా చూడలేదు. 'ఏడు కొండలు' మాత్రం భక్తుల్ని దేశం నాల్గు చెరగల నుంచి మూడొందల అరవై ఐదు రోజులూ కదిలిస్తూనే ఉన్నాయి.

తిరుపతి ప్రయాణం అంటే మాటలా? ఖర్చు వంద రూపాయలన్నా అవుతుంది-- దేవుడి హుండీలో వేయాల్సిన మొక్కుబడి వందరూపాయలు గాక, పసుపు గుడ్డలో శ్రీమతి కట్టిచ్చిన పచ్చనోటును జేబులో వేసికొని, ఓ చిన్న సంచితో ప్రైవేటు బస్సులో తిరుపతి చేరాడు రామారావు.




ప్రయాణం ఖర్చు భారమే. అయితే, తప్పదు. శ్రీ వెంకటేశ్వర స్వామి దయ వల్లనే ఎన్నాళ్ళో ఆగిపోయిన ప్రమోషను ఇప్పుడు వచ్చిందని రామారావు నమ్మకం. కారణం ముడుపుకట్టిన నెల రోజుల్లోనే ఆర్డరు రావటం.....

.....జీతం అప్పుడప్పుడు పెరగకపోలేదు. కాని ఖర్చులంతకన్నా ఎక్కువగా పెరుగుతున్నాయే? ఆదాయం సరిపోనప్పుడు ఖర్చులు తగ్గించు కోవాలి.


సరిగ్గా అదే పని చేస్తున్నందుకు రామారావుకు సంతోషం.

కూరలు కాళేశ్వరరావు మార్కెట్టులో గాని కొనడు. పప్పులు పప్పుల మిల్లులో బియ్యం బియ్యం మిల్లులో తేవటం అలవాటు చేసి కొన్నాడు.

రోజు గడ్డం చేసికొనే బ్లేడు కూడా ఎంతో ఆలోచించి కొంటాడు. రూపాయి పెట్టి నాల్గు సార్లు ఉపయోగపడే బ్లేడు బదులు, అర్ధరూపాయిపెట్టి మూడుసార్లు ఉపయోగ పడే బ్లేడు కొంటం లాభమని తెల్సికో వటానికి రామారావుకు ఎంతో కాలం పట్ట లేదు. దుప్పట్లు, లుంగీలు, టవల్సు కొనా లంటే దసరా, దీపావళీ రావాల్సిందే. అప్పుడుగాని ఆప్కో వారు రిబేటు ఇవ్వరు. కాటన్ బట్టలతో ఇస్త్రీ, మన్నిక సమస్యలు పూర్తి పాలిష్టరు బట్టలు ఖరీదు, అందు బాటులో లేవు. అందుకని టెరికాటన్ బట్టలు కొంటం అలవాటు చేసికొన్నాడు.




జీవిత సమరాన్ని నెమరు వేసుకొంటున్న రామారావు కు తప్పని ఖర్చుల సంగతి గుర్తుచ్చింది. ప్రమోషను తోటీ గుమస్తాలు ఊరు కొంటారా? పార్టీ, పార్టీ అని ఒకటే గోల. అక్కడ చేతనయినంత వరకు ఖర్చు తగ్గించు కోవటానికే ప్రయత్నం. విస్కీ అయితే తలనొప్పి వస్తుందని, బ్రాందీ ఇస్తానన్నాడు. బారులో అయితే ఒకటే జన మంటారని మరొక బ్రహ్మచారి గుమస్తా ఇంట్లో పార్టీ ఏర్పాటు చేశాడు. బాలాజీ వైన్సులో రెండు రూపాయలు ఎక్కువని వెంకటేశ్వర వైన్సులో సీసా కొన్నాడు.....

ఆపద మొక్కుల వాడా, వేంకటేశ్వరా గోవిందా, గోవిందా' మళ్ళీ జనం అందు కొన్నారు. ఆలోచనా ప్రవంతిని ఆపేసు కొని జనంతో పాడుతూ ముందుకు కదిలాడు. ఈసారి మహాద్వారం ముందుకు చేరాడు.

ఇంతలో మళ్ళీ ఓ పెద్ద అలలాగా జనం వచ్చి వెనుకనుంచి ఒక తోపు తోశారు. 'గోవిందా, గోవిందా' అంటునే రెండు చేతు లెత్తి దేవుడికి నమస్కరిస్తూనే ముందుకి కదిలాడు. లేక నెట్టబడ్డాడు.

మూల విరాట్టుకు పది అడుగుల దూరం లోనే రామారావు తన కృతజ్ఞతను దేవుడికి తెలుపుకొన్నాడు. 'స్వామి, ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలుగ జేయి' అని విన్నవించుకొన్నాడు. ఇప్పుడు సరిగ్గా దేవుని ముందే నిల్చొన్నాడు.

రెండు కళ్ళూ తెరిచి దేవుని తనివి తీరా దర్శించాడు. దేవుని ముఖంలో చిరునవ్వు తొణికిసలాడింది.

భ్రమ? నిజమా? మరోసారి చూసే అవకాశం దొరకలేదు. జరగండి, జరగండి అని గుళ్ళో వలంటీర్లుమీద చేతులు వేయటం మొదలు పెట్టారు.

బయటకు వచ్చి, విమాన వెంకటేశ్వర్లుణ్ణి చూసి నేరుగా హుండీ దగ్గరకు వెళ్ళాడు.

జేబులో చేయి పెట్టే చేయి బయటకు వచ్చింది. లాల్చీ జేబు ఎవరో కత్తిరించి, తన నూరు రూపాయలు ఉన్న ముడుపును కొట్టేశారు.

వళ్ళు చెమటలు గమ్మింది. పక్కనే ఉన్న మండపం దగ్గరికి వెళ్ళి కొంచెం సేపు కూర్చొన్నాడు. మహాద్వారం దగ్గర తోపుడు లో తన ముడుపును ఎవరో కొట్టేశారని ఊహించు కొన్నాడు రామారావు. ఇప్పుడేం చేయాలి? తను ముడుపు చెల్లించినట్లా, లేదా?

ఆలోచన దేవుని లీలల మీదికి పోయింది. తన భక్తికి మెచ్చి, ప్రమోషను ఇప్పించాడే! తిరుపతి దాకా ప్రయాణం కట్టించాడే! మరి ఆఖరి నిముషంలో ఈదుర్ఘటన ఏమిటి?

ఇంతలో మెరుపులాగా మరో ఆలోచన వచ్చింది. ఇబ్బందుల్లో ఉన్న మరో భక్తునికి దేవుడు సాయం చేసి ఉండచ్చు కదా? దొంగ అయితే మాత్రం, ఎన్నాళ్ళనుంచి సంపాదన లేదో? తిరుమల క్యూలో నిల్చోమన్న ఆలోచన దొంగకు కూడా దేవుడే ఇచ్చాడేమో! శివునికి తెలీకుండా చీమన్నా కుట్టుందా?

దేవుని ముడుపు గుడిప్రాంగణంలో ఇలా చెల్లించాననుకొని తృప్తిపడి, తిరుగు ప్రయాణం మొదలు పెట్టాడు రామారావు. అంతకన్నా ప్రస్తుతం చేయగల్గిందేమీలేదు. సంచీలో ఉన్నది ప్రయణపు ఖర్చులు మాత్రమే. అందులోంచి ఓ మూడు రుపాయలు తీసి లడ్డు ప్రసాదం కొనుక్కొని బస్ ఎక్కాడు.

బస్ ఘాట్‌రోడ్డులో మెలికలు తిరిగినప్పుడల్లా, తన మనసు కూడా వెనక్కు, ముందుకు తిరగటం మొదలు పెట్టింది. తిరుపతికి వచ్చే ముందు రోజు పని మనిషి లక్ష్మి పనిలో చేరి రెండు ఏండ్లు అయింది. పేరుకు మాత్రమే లక్ష్మి. ఎప్పుడూ ఎడ్వాన్సు కావాలి. "పక్కింట్లో ఐదుగురున్నా ముప్పయి రూపాయలే, మాయింట్లో ముగ్గురు మాత్రమే ఉన్నా అదే జీతం. న్యాయం లేదు. హై నెలకు ఆరునాగాలు'. గడ, గడ తనమనస్సు లోని భావాలను బైటకు అనేశాడు.

ఇప్పుడు లక్ష్మికి జీవితంలో ప్రమోషను ఉంటుందా? ఇంక్రిమెంట్లు లేవు. తనకో ప్రావిడెంటు ఫండు, గ్రాట్యుటీ, పెన్షను క్యాజువల్ లీవు, ప్రైవి లేజీ లీవు, ఎరన్డ్ లీవు. శనీ ఆదీ వారాలకు, పండుగలకు శలవులు ఈమధ్య బోనసు కూడా ఇస్తున్నారు. పండ గలకు ఎడ్వాన్సు జీతం.

ఏదో తప్పు చేసిన వాడిలాగా ఫిలయ్యాడు. తాను దేవుని విగ్రహంలో చూసింది నిజంగానే చిరునవ్వని ఇప్పుడనిపిస్తుంది. 'నీ బాగే కాదు, ఇతరుల బాగుకూడా చూడు' అని స్వామి సలహా ఇచ్చారా?

ఇంటికి చేరంగానే లక్ష్మికి ఓ ఐదు రూపాయల ఇంక్రిమెంటు ఇస్తున్నట్లు ప్రకటించి, ప్రసాదం పెట్టాడు. భర్త లీలలేంటో శ్రీమతికి వెంటనే అర్థం కాలే.



## విఘ్నరాజునకు వినతి

గరిక పరకల నీకు స్వాగతము నెఱప
గడ్డి కరచెడు నాయకుల్ కలుగుచోట
దానికిని గూడ కరవయ్యె; దేవ నీకు
వినత పూజలొనర్తు? నో విఘ్నరాజ!

తారకలనంటె మానెల ధరలు - మున్నె
తక్కు వస్తువుల్ మిన్నెక్కి వెక్కిరించె;
ఎట్లు సామాన్యుడిపుడు విందీయగలడు?
వాని క్షమియింపుమయ్య! నిబ్బరపు కరుణ

ఒక్క వేషంబుతో వత్తువుర్వికెపుడు
పూర్వ వేషంబు ప్రజలకు మొగముమొత్తె
క్రొత్త వేషంబుతో రమ్ము కోర్కెదీర
ప్రాత రోత; క్రొత్తొక వింత పార్వతీజ!

గొంతు తడుపుకొనగ గుక్కెడు నీరమ్మె
కొన్నియెడల కలుగకున్న దిపుడు
వాన లెక్కువౌట - పైరు పంటల ముంచె
వరద నీరు కొన్ని ప్రాంతములను

వెనుక పండిన పంటను కొనెడు దిక్కు
లేక రైతులు దుఃఖింతు రాకలేక
వమ్ము జీతము చాలక వనటగుందు
పేద యుద్యోగి; నీకెట్లు విందు కలుగు?

బక్కచిక్కిన వారలు పిక్కబలిసి
రాజకీయంపు (వి)నాయకుల్ ప్రబలురగుచు
గుడిసెలను గూర్చి మేడల వడి ఘటింత్రు
వేడుమా! వారి నీయేడు విఘ్నరాజ!

—మొవ్వ వృషాద్రిపతి